కథ

ఎన్.శివనాగేశ్వరరావు

# మలుపులు

మంచి సినిమా. డైరెక్షన్ చాలా బాగుంది.. అని మీరు చాలాసార్లు అని వుంటారు. లేకపోతే విని వుంటారు. నా దృష్టిలో మాత్రం భగవంతుని మించిన డైరెక్టర్ మరొకరు లేరు. ఎందుకంటే ప్రపంచంలో ఎన్ని కోట్లమంది మనుషులు ఉన్నారో అన్ని కోట్ల కథలు ఉన్నట్లే. అంతేకాదు ఏ కథకాకథ డిఫరెంట్‌గా వుంటుంది. ప్రతి జీవితంలోనూ ఎన్నో మలుపులు ఉంటాయి. అందుకే నా దృష్టిలో భగవంతుడే సూపర్ డైరెక్టర్.

ఎవరోవరకు ఎందుకు? ఉదాహరణకు నా కథనే తీసుకుందాం. దాన్ని భగవంతుడు ఎలా డైరెక్ట్ చేసాడో, ఎన్ని మలుపులు తిప్పాడో చూద్దాం. అన్ని మలుపులు కూడా వద్దు. మీకు బోర్ కొట్టవచ్చు. అందుకే ప్రేమకు సంబంధించిన మలుపులు చూద్దాం.

నేను కాలేజీలో చదివే రోజుల్లో మంజూషను ప్రేమించాను. అంతవరకూ చదువు తప్ప మరో ప్రపంచం తెలీని నాకు మంజూష ప్రేమ ఒక పెద్ద మలుపు. నేను ఆమె మనసును చూసి ప్రేమించలేదు. డబ్బు చూసి ప్రేమించలేదు. మంజూష అందాన్ని చూసి పిచ్చిగా ప్రేమించాను. ఆరాధించాను. నిజంగానే కళ్ళు చెదరగొట్టే అందం మంజూషది. నాలాగే చాలామంది ఆమెను ప్రేమించారు.

మంజూషకు తను అందగత్తెనని బాగా తెలుసు. తన అందం చూసి చాలామంది కుర్రకారు పిచ్చివాళ్ళు అవుతున్నారని తెలుసు. అందుకే ఆమె కాస్తంత పొగరుగా ఉండేది. ఎవరి వంకా కన్నెత్తి చూసేది కాదు. పన్నెత్తి మాట్లాడేది కాదు. ఆమె ఒక్కసారి చూస్తే చాలు తమ జన్మధన్యమౌతుందని చాలామంది పడిగాపులు కాసేవారు. అది తెలిసి మంజూష అసలు ఎవరివంకా చూసేది కాదు. మంజూష నాపట్ల కూడా అలానే ప్రవర్తిస్తుందని భావించాను. అక్కడే దేవుడు నా జీవితాన్ని మరొక మలుపు తిప్పాడు.

మంజూష నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేది. నన్ను పలకరించేది. చాలా విషయాలు మాట్లాడేది. తమ వంక మంజూష ఒక్కసారి చూస్తే చాలు అని కలలు కనే కుర్రకారు మంజూష అలా నాతో మాట్లాడుతుంటే నావంక జెలసీగా చూసేవారు. కొంతమంది నా దగ్గర 'యూ ఆర్ సో లక్కీ' అనేవారు.

అంత పొగరుగా ఉండే మంజూష నా పట్ల శ్రద్ధ చూపడానికి, నాతో చనువుగా మసలడానికి కారణం నా ఇంటలిజెన్స్. చదువులో నేనే ఎప్పుడూ ఫస్ట్. లెక్చరర్స్ అందరూ నన్నెంతగానో ప్రశంసించేవారు. అది మంజూషను ఆకట్టుకుంది. మంజూష చదువులో ఏవరేజ్. అందుకే నన్ను ఇష్టపడేది. అయితే అది ఎటువంటి ఇష్టమో నాకు అర్థమయ్యేది కాదు.

నేను మాత్రం మంజూషను ప్రేమించాను. కలలు కన్నాను. అయితే నా ప్రేమను వ్యక్తీకరించడానికి సాహసించలేకపోయాను. ఎవరికోసం ఆగని కాలం ముందుకు పరుగుతీస్తూనే ఉంది. మేం డిగ్రీ థర్డ్ ఇయర్‌కి రావడం, ఫైనల్ ఎగ్జామ్స్ రావడం కూడా జరిగిపోయింది. మంజూష, నేను విడిపోతాం అనుకుంటేనే చెప్పలేనంత బాధనిపించింది.

అసలు నా ప్రేమ చదువుని దెబ్బతీయకుండా ఉండడానికి నా సర్వశక్తులు ఒడ్డవలసి వచ్చింది. మంజూష మీద నేను ఏర్పరచుకున్న పిచ్చి ప్రేమను, చదువుమీద నాకున్న మమకారాన్ని ఎంతో కష్టంమీద రెండుగా విడదీయగలిగాను. రెండూ నాకు ప్రియమైనవే. అందుకే పరీక్షలు బాగా రాయగలిగాను.

ఎగ్జామ్ హాల్ నుంచి బయటకు వస్తుంటే మంజూష ఎవరికోసమో ఎదురుచూస్తూ కనిపించింది. నా గుండె ఉద్వేగంతో కొట్టుకుంది.

నేను కనిపించగానే మంజూష ప్రేమగా నవ్వి "నీ కోసమే ఎదురుచూస్తున్నాను" అంది.

"థాంక్స్..పరీక్ష ఎలా రాసావు" అని అడిగాను.

"నీ అంత బాగా మాత్రం కాదు" అని నవ్వింది మంజూష.

ఆ నవ్వు ఎంతో అందంగా అనిపించింది.

"ఈరోజు మా ఊరు వెళ్ళిపోతున్నాను. ఇక మనం కలవం. అది చెప్పడానికే ఆగాను" అంది మంజూష.

ఆ ఒక్కమాటతో నా మనసులో కోటి ఆశలు చిగురించాయి. మంజూష కూడా నన్ను ప్రేమిస్తున్నదేమోనన్న నా మనసులోని సంశయం బలపడింది. నా ప్రేమను వ్యక్తీకరించడానికి ఇంతకంటే మంచి సమయం రాదేమో అనిపించింది. ఈ క్షణం ధైర్యం చేయకపోతే మంజూషను శాశ్వతంగా పోగొట్టుకుంటాననిపించింది. గుండె వేగం మరింత పెరిగింది. నా ప్రేమను వ్యక్తీకరించడానికే సాహసించాను.

"మంజూ! నీవు కోపగించనంటే ఒక మాట చెప్పాలనుకుంటున్నాను" అన్నాను.

"నీ మీద కోపమా? నెవర్! నువ్వంటే నాకు చాలా ఇష్టం. చెప్పు" అంది మంజూష.

'నువ్వంటే నాకిష్టం' అని మంజూష నోటినుంచి వచ్చిన మాట నా ధైర్యాన్ని మరింత పెంచింది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుంటాను" అన్నాను.

ఆ మాటకు మంజూష పక పకా నవ్వింది.

"పిచ్చి సిద్దూ! నువ్వు చదువులోనే బ్రిలియంట్. మిగిలిన విషయాల్లో చాలా పూర్. మన కులాలు వేరు. ఆర్థిక పరిస్థితులు వేరు. నేను నిన్ను ఇష్టపడడానికి కారణం నీ ఇంటలిజెన్స్. నీమీద నా ఫీలింగ్స్ అంతవరకే! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటే నా ఖర్చులు నీవు ఏమాత్రం భరించలేవు. నాక్కాబోయే భర్త మా కంటే రిచ్‌గా ఉండాలి. నువ్వు ఇవన్నీ మనసులో పెట్టుకోకుండా పై చదువులు బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడు. ఆల్ ది బెస్ట్" అని షేక్ హేండిచ్చింది మంజూష.

అది నా జీవితాన్ని దేవుడు తిప్పిన మరొక మలుపని చెప్పాలి. నేను చేష్టలుడిగి అలానే ఉండిపోయాను. మంజూష నాకు 'బై' చెప్పి వెళ్ళిపోయింది.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి మా ఆర్థిక స్థోమత సరిపోలేదు. చెల్లి పెళ్లి చేయడానికి నేను త్వరగా ఉద్యోగం చూసుకోవలసి వచ్చింది. ఉద్యోగ ప్రయత్నం ఫలించి బ్యాంక్‌లో క్లర్క్ పోస్ట్‌కి సెలక్ట్ అయ్యాను. మా మధ్యతరగతి కుటుంబానికి అది చాలా మంచి ఉద్యోగం. అందుకే మరో ఆలోచన చేయకుండా అందులో చేరిపోయాను. చెల్లి పెళ్ళికోసం నాన్న కూడబెట్టిందేం లేదు. అందుకే నా సంపాదన కూడబెట్టసాగాను. అయిదేళ్ళు గడిచాయి. చెల్లి పెళ్ళి చేయగలిగాం. అందుకు నేను చాలా గర్వపడ్డాను.

అమ్మ, నాన్నలు నా పెళ్ళికి బలవంతం చేయసాగారు. నేను మాత్రం మంజూషను ఏమాత్రం మరచిపోలేకపోయాను. పెళ్ళిచూపులకు వెళ్ళి ఏ అమ్మాయిని చూసినా మంజూష గుర్తుకు వచ్చేది. అందుకే ఏ సంబంధమూ ఒప్పుకోలేకపోయాను.

అందుకే ఈసారి అమ్మ, నాన్నే నిర్ణయం తీసేసుకు



న్నారు. మేం ఆఖరిసారిగా పెళ్ళిచూపులకు వెళ్ళిన అమ్మాయి పేరు శ్రీలక్ష్మి. అమ్మ, నాన్నలు ఆ అమ్మాయినే ఖరారు చేసారు. మంజూష కానప్పుడు ఎవరైతేనేం అనుకున్న నేను కూడా శ్రీలక్ష్మిని కాదనలేదు.

శ్రీలక్ష్మితో నా పెళ్ళి సింపుల్‌గా జరిగిపోయింది. శ్రీలక్ష్మి కాపురానికి వచ్చింది. తను మంజూష అంతటి అందగత్తె కాదు గాని బాగానే ఉంటుందని చెప్పాలి. వంటా, వార్పు వచ్చు. ఒక రకంగా మంచి అమ్మాయనే చెప్పాలి. తనతో నాకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. తను నా ఇష్టా ఇష్టాలు తెలుసుకుని ప్రవర్తిస్తుంది. స్నానానికి వేడినీళ్ళు పెడుతుంది. నాకిష్టమైన కూరలు వండి పెడుతుంది. సినిమాలకు, షికార్లకూ తీసుకెళ్ళమని అడగదు. పుట్టింటికి వెళ్తానని అడగదు. చీరలు కావాలని, నగలు కొనమనీ అలగదు. ఆఖరికి మూరెడు మల్లెలు కూడా అడగని మంచి ఇల్లాలు శ్రీలక్ష్మి.

తను అడగదని తెలిసి కూడా నేను ఏనాడూ ఆమె కోరికలు..ఆఖరికి చిన్నవి కూడా తీర్చలేదు. తీర్చే ప్రయత్నం కూడా చేయలేదు. ఎప్పుడూ నాది ఒకటే ఆలోచన. నా భార్య మంజూష అంతటి అందగత్తె కాదు. ఆఖరికి ఆమె కాలి గోటికి కూడా సరితూగదు. ఆ ఆలోచన నన్ను మనసు లేనివాడిగా మార్చేసేది. తనతో మనసువిప్పి మాట్లాడలేకపోయేవాడిని. ప్రేమగా మసలుకోలేకపోయేవాడిని. నా ప్రవర్తనకు శ్రీలక్ష్మి బాధపడుతుందని తెలుసు. అయినా నా ప్రవర్తన మార్చుకోలేకపోయేవాడిని. అలా రెండేళ్ళు గడిచాయి.

అటువంటి పరిస్థితుల్లో మా బ్రాంచ్ మేనేజర్ ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. అతని స్థానంలో దయాకర్ అనే కొత్త మేనేజర్ వచ్చాడు. పాత మేనేజర్‌లా దయాకర్ బైక్ మీద రాలేదు. ఖరీదైన కారులో వచ్చాడు.

పరిచయాలు అయ్యాయి. అతను యువకుడే. మనిషి మంచివాడిలా, అంతకుమించి విధి నిర్వహణలో సమర్థుడిలా కనిపించాడు.

నేను స్టెనోగ్రాఫర్‌ని కావడంతో అతనికి కాస్తంత క్లోజ్‌గా ఉండవలసి వచ్చింది.

దయాకర్ వచ్చి నెలరోజులైంది. స్టాఫ్‌తో కలివిడిగా ఉండేవాడు. కస్టమర్స్‌తో మర్యాద పూర్వకంగా ఉండేవాడు. నాకతనిమీద మంచి స్నేహభావం కలిగింది.

ఒకరోజు దయాకర్ నాకు డిక్టేషన్ ఇచ్చాడు. అప్పటికి ఐదు గంటలు దాటిపోయింది. నేను టైప్ చేస్తుం

డగా దయాకర్ నా దగ్గరకు వచ్చాడు. "సిద్ధార్థగారూ! నాకు జ్వరం వచ్చినట్లుంది. కూర్చోలేకపోతున్నాను. నేను ఇంటికి వెళ్తాను. మీకు అభ్యంతరం లేకపోతే టైప్ చేసిన పేపర్స్ ఇంటికి తీసుకురండి. సంతకాలు చేస్తాను. కొరియర్‌కి ఇచ్చేద్దురుగాని. ఇవి అర్జెంట్‌గా వెళ్ళాలి. అందుకే మీకు శ్రమ కలిగిస్తున్నాను" అన్నాడు.

"మీరు బయలుదేరండి. నేను వచ్చి కలుస్తాను" అని చెప్పి అతన్ని పంపేసాను. నా పని పూర్తవడానికి గంట పట్టింది. దయాకర్ ఇల్లు ఎక్కడో చూచాయగా తెలుసు. స్కూటర్ మీద బయలుదేరి అతని ఇల్లు చేరాను. కాలింగ్ బెల్ ప్రెస్ చేసాను. తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి షాక్ అయ్యాను. ఆమె ఎవరో కాదు మంజూష.

నాకు భగవంతుడు గుర్తుకు వచ్చాడు. ఇది ఆయన ఇచ్చిన మరొక ట్విస్ట్. మంజూషను మరలా చూస్తాననుకోలేదు.

నన్ను చూడగానే మంజూష ముఖంలో సంతోషం కనిపించింది.

"సిద్ధార్థ వస్తాడని మావారు చెప్తే ఎవరో అనుకున్నాను. నువ్వని మాత్రం అనుకోలేదు. ఐయామ్ రియల్లీ హేపీ. వచ్చి కూర్చో" అని కాఫీ తెచ్చిచ్చింది.

"సార్‌కెలా ఉంది?" అని అడిగాను.

"టాబ్లెట్స్ వేసుకుని పడుకున్నారు" అని చెప్పింది మంజూష.

అంతలో దయాకర్ వచ్చాడు. లాల్చీ, పైజమాలో మనిషి మరింత అందంగా, హుందాగా ఉన్నాడు.

మంజూష అతనితో "ఇతను నా క్లాస్‌మేట్" అని చెప్పింది.

"అయితే నేను ఇంటి రమ్మని చెప్పడం మంచిదే అయింది" అని నవ్వాడు దయాకర్.

సంతకాలు చేసాక నేను బయలుదేరిపోయాను. "అప్పుడప్పుడు వస్తూ ఉండు" అని ఆహ్వానించింది మంజూష.

"అలానే" అని చెప్పి బయలుదేరిపోయాను.


ఇల్లు చేరాను. మనసంతా అశాంతి. శ్రీలక్ష్మి మంచినీళ్ళు అందిస్తే వద్దని చిరాకుపడ్డాను. విలువైనది పోగొట్టుకున్న ఫీలింగ్ మనసంతా నిండిపోయింది.

శ్రీలక్ష్మి బాత్‌రూమ్‌లో వేడినీళ్ళు పెట్టి టవల్ అందించింది. కాస్తంత ఫ్రెష్‌గా ఉంటుందని స్నానం చేసాను.

"భోజనం వడ్డించాను" అంది శ్రీలక్ష్మి.

వద్దని చెప్పేసాను. తను నా మూడ్ అర్థం చేసుకున్నట్లు మౌనంగా తలదించుకు వెళ్ళిపోయింది.

మరునాడు ఆఫీస్‌కి బయలుదేరుతుంటే దయాకర్‌ని మంజూష భర్తగా చూడాలన్న ఆలోచన వచ్చి చిన్నగా నిట్టూర్చాను.





నేను మంజూష క్లాస్‌మేట్‌ని అని తెలిసాక దయాకర్ నాతో మరింత క్లోజ్‌గా మూవ్ అయ్యాడు. తన పర్సనల్ విషయాలు చెప్పేవాడు. అయినా నేను నా పరిధిని మరచిపోలేదు. అతను నా బాస్. ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండేవాడ్ని.

ఒకరోజు దయాకర్ చాలా డిస్టర్బ్‌డ్‌గా కనిపించాడు. నన్ను దగ్గరకు పిలిచి "ఇఫ్ యూ డోంట్ మైండ్. ఈవినింగ్ నాకు కాస్తంత కంపెనీ ఇవ్వగలరా?" అని అడిగాడు.

"ష్యూర్ సర్" అన్నాను.


సాయంత్రం ఇద్దరం దయాకర్ కారులో ఖరీదైన బార్‌కి వెళ్ళాం.

నాకు ఆల్కహాల్ అలవాటు లేదని చెప్పాను. అతను విస్కీ ఆర్డర్ చేసాడు. నేను దయాకర్ చెప్పేది వినడానికి సిద్ధంగా ఉన్నాను. విస్కీ వచ్చింది. అతను విస్కీ సిప్ చేస్తూ "సిద్ధార్థగారూ! చిన్న వయసులోనే జీవితంలో చాలా అలసిపోయాను. జీవితంలో అన్నింటికంటే విలువైనది ఏమిటని మిమ్మల్ని అడిగితే మీరేం చెబుతారోగాని నేను మాత్రం లైఫ్ పార్ట్నర్ అని చెబుతాను. భార్యకి కావలసింది అందం..డబ్బు కాదని మంజూషను పెళ్ళి చేసుకున్నాక ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను. తనకి డబ్బుందన్న అహంకారం నర నరాన ఉంది. నన్ను డబ్బుతో కొనుక్కున్న ఫీలింగ్ ఉంది. ఎప్పుడూ నా గురించి ఆలోచించదు. నా ఇష్టాఇష్టాలు అసలు పట్టించుకోదు. ఎంతసేపూ తనకు కావలసినవి ఏర్పాటు చేయమని నన్ను సతాయిస్తుందేగాని నా అవసరాల గురించి ఆలోచించదు. సిగ్గువిడిచి చెబుతున్నాను. కడుపునిండా తిండి కూడా పెట్టదు. ఆఫీస్‌లో



## ఆయేషా పెళ్లి?

ఒకప్పటి 'కాంప్లాన్ గాళ్' నేటి బాలీవుడ్ బ్యూటీ ఆయేషా టకియా త్వరలోనే పెళ్లి చేసుకునే ప్రయత్నాల్లో వుందిట. తను నటిస్తున్న సినిమాల నిర్మాతలను తొందరగా షూటింగ్ పూర్తి చేసుకోమని చెప్పేస్తోందిట. 2009 జనవరిలో తన బాయ్‌ఫ్రెండ్ ఫర్హాన్ ఆజ్మీతో ఆయేషా వివాహం జరుగుతుందని బాలీవుడ్‌లో జోరుగా వినిపిస్తోంది. పెళ్లి తర్వాత సినిమాలను కంటిన్యూ చేసే వుద్దేశం లేదేమో!




పనిచేసి అలసిపోయి ఇల్లుచేరిన నేను ఎన్నో రాత్రులు ఆకలితో అలమటిస్తూ గడిపాను. తనతో ప్రతిక్షణం నరకం అనుభవిస్తున్నాను. అమ్మ ఒడిలో ఎంతో ప్రేమతో పెరిగిన నేను ఇప్పుడీ ప్రేమరాహిత్యం భరించలేకపోతున్నాను. ఇటువంటి జీవితం ఎవరికీ వద్దు. సారీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను" దయాకర్ కంటతడిని నేను గమనించకూడదన్నట్లు తుడుచుకున్నాడు.

ఇది నాకు జీవితంలో మరో మలుపు. నేను ఊహించనిది. నేనింతకాలం మంజూషను కోల్పోయానని బాధపడ్డానుగాని ఆమెను పెళ్ళి చేసుకుని ఉంటే ఎంత నరకం అనుభవించి ఉండేవాడినో దయాకర్ మాటలను బట్టి తెలుసుకున్నాను.

దయాకర్ నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు. శ్రీలక్ష్మి నాకోసం ఎదురుచూస్తూ భోజనం చేయలేదు. "నాకు ఆకలిగా లేదు" అని వెళ్ళిపడుకున్నాను. "మీకిష్టమని కాకరకాయ వేపుడు చేసాను. కొద్దిగా తినండి" అంది శ్రీలక్ష్మి.

"వద్దు" అని ముఖం తిప్పుకున్నాను.

"కనీసం మజ్జిగ తీసుకోండి" శ్రీలక్ష్మి గ్లాసుతో మజ్జిగ అందించింది.

శ్రీలక్ష్మి కళ్ళల్లోకి చూసాను. వాటిల్లో విషాదం కనిపించింది. మారు మాట్లాడక గ్లాసు అందుకుని మజ్జిగ త్రాగాను.

శ్రీలక్ష్మి కిచెన్‌లో గిన్నెలు సర్దిపెట్టి వచ్చిపడుకుంది. ఆమె భోజనం చేయలేదని అర్థమైంది.

"నీవు తినలేదేం?" అని అడిగాను.

"మీరు తినకపోతే నాకు తినబుద్ధి కాదు" శ్రీలక్ష్మి సన్నగా గొణిగింది.

నాకు చాలాసేపు నిద్రపట్టలేదు. అక్కడ నేను ప్రేమించిన మంజూష మనసు లేకుండా భర్తను హింసిస్తుంటే ఇక్కడ నేను, నన్ను ప్రేమిస్తున్న శ్రీలక్ష్మిని హింసిస్తున్నాను. శ్రీలక్ష్మి పట్ల నా మనసు ఆర్ద్రమయింది.

మెల్లగా నిద్రపట్టేసింది. హఠాత్తుగా మెలకువ వచ్చి చూస్తే శ్రీలక్ష్మి నా పక్కన కూర్చుని విసనకర్రతో విసురుతున్నది. కరెంట్ పోయిన సంగతి గ్రహించి "ఎంతసేపయింది కరెంట్ పోయి?" అని శ్రీలక్ష్మిని అడిగాను.

"దాదాపు రెండు గంటలయింది" చెప్పింది శ్రీలక్ష్మి.

నాకు కరెంట్ లేకపోతే ఐదు నిముషాలకే మెలుకువ వచ్చేస్తుంది. అంటే రెండు గంటల నుంచి శ్రీలక్ష్మి అలా విసురుతూనే కూర్చున్నదని అర్థం చేసుకున్నాను.

"ఏంటిది? నేనేమైనా చంటి పిల్లాడినా?" అని శ్రీలక్ష్మి చేతిలోని విసనకర్ర తీసుకుని ప్రక్కన పడేసాను.

"కరెంట్ లేకపోతే మీకు నిద్రపట్టదని తెలుసు. అందుకే...!" అంది శ్రీలక్ష్మి.

నా హృదయంలో ఒక ప్రేమ పవనం బలంగా వీచింది.

శ్రీలక్ష్మిని ప్రేమగా దగ్గరకు తీసుకున్నాను. ఆమె నా కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది. తొలిసారి నా హృదయం ఆమె హృదయంతో మౌనంగా మాట్లాడసాగింది. ఫ్యాన్ తిరక్కపోయినా నాకేం ఉక్కగా అనిపించలేదు. ఆరుబయట పండు వెన్నెల్లో విహరిస్తున్నట్లనిపించింది.

ఇప్పుడు ఒప్పుకుంటారు కదూ! భగవంతుని మించిన డైరెక్టర్ లేదని. ఒకప్పుడు ఏది లేకపోతే క్షణం బ్రతకలేమని అనుకుంటామో, మరొకప్పుడు అది దొరక్కపోవడమే నయమనుకుంటాం. అంతేకాదు ఒకప్పుడు మనకు దొరికింది మట్టి అని బాధపడిన మనమే మరొకప్పుడు మనకు దొరికింది మాణిక్యం అని తెలుసుకుని పొంగిపోతాం.

## కరీనా స్టయిల్!

బాలీవుడ్‌లో కరీనా కపూర్ ఫ్యాషన్ స్టయిల్‌కి ఓ ప్రత్యేకత వుంది. విదేశాల్లో వచ్చిన ఫ్యాషన్ మార్పుల్ని దేశీయంగా మార్పు చేసుకుని వీలైనంత వెరైటీగా డ్రెస్సింగ్ చేసుకోడంలో కరీనాకి బాగానే పేరుంది మరి. కొన్ని సినిమాల్లో తన పాత్రలకి తనే డ్రెస్ డిజైనింగ్ కూడా చేసుకోవడం జరుగుతుంటుంది అప్పుడప్పుడు. తాజాగా ఫ్యాషన్‌పై తనకున్న మమకారాన్ని తెలియచేసేందుకు అన్నట్టుగా ఓ వెబ్‌సైట్‌ని కూడా ప్రారంభించబోతోందిట కరీనా. ఈ సైట్‌లో ఫ్యాషన్ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, కొత్త కొత్త డిజైనింగ్‌లు వగైరాలు పొందుపరిచే సన్నాహాల్లో వుందిట కరీనా.

